# అమెరికా - పాకిస్థాన్ సంబంధాలు

# లాలించే, గద్దించే పన్నాగాలు

**అమెరికా** అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి పాకిస్థాన్ నాయకులపై విరుచుకు పడ్డాడు. 'ఒసామా బిన్ లాడెన్ తన మరణానికి ముందు పాకిస్థాన్‌లో తలదాచుకున్నాడనే విషయం పాకిస్థాన్‌లోని ప్రతి ఒక్కరికీ తెలుసు' అని చాలా మొరటుగా ట్రంపు గద్దించి మాట్లాడాడు. "అమెరికా పాకిస్తాన్‌కు సంవత్సరానికి 130 కోట్ల డాలర్లు సహాయం ఇస్తోంది. అయితే పాకిస్తాన్ నాయకులు అమెరికాకు లాడెన్ ఆచూకీ గురించి తెలపలేదు. అమెరికా పాకిస్తాన్‌కు తగినంత డబ్బు చెల్లించింది. అయితే ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్ల సమస్యను అంతంచేసేందుకు వారేమీ చేయలేకపోయారు". "రక్షణ సహాయం క్రింద పాకిస్తాన్‌కు ఇస్తున్న 166 కోట్ల డాలర్లను నేను నిలిపివేస్తున్నాను, ఎందుకంటే, వారు మమ్మల్ని ధిక్కరిస్తున్నార"ని ట్రంప్ ప్రకటించాడు.

2018 ఆగస్టులో అమెరికా 'ఆఫ్ఘన్ విధానం'గా పిలవబడే దానిని ప్రకటించింది. పాకిస్తాన్‌కు 30 కోట్ల డాలర్ల రక్షణ సహాయాన్ని నిలిపివేస్తామని 2018 సెప్టెంబర్‌లో అమెరికా పాకిస్తాన్‌ను హెచ్చరించింది. ఆనాటినుండి బహిరంగంగా ట్రంప్, పాకిస్తాన్ నాయకులను గదమాయిస్తూ మాట్లాడుతూవస్తున్నాడు.

ఈ తరహా బహిరంగ దూషణలు, గదమాయింపులనేవి దళారీ నాయకులనైనా 'గాయ'పరుస్తాయనేది నిజం. కనుకనే, పాకిస్తాన్ నూతన ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ దీనిపై స్పందించాడు. టెర్రరిజంపై అమెరికా సాగిస్తుందంటోన్న యుద్ధ భారాన్ని పాకిస్తాన్ తలకెత్తుకుని మోస్తున్నదని ఇమ్రాన్ వాదన చేశాడు. అమెరికాలోని ట్విన్ టవర్స్‌ను కూల్చివేసిన 9/11 నాటి ఘటనలో పాకిస్తాన్ ప్రమేయమేమీ లేకపోయినప్పటికీ, తాలిబన్లపై అమెరికా సాగించే యుద్ధంలో పాల్గొనాలని ఆ దేశం నిర్ణయించుకుంది. 'ఈ యుద్ధంలో పాకిస్తానీయులు 75 వేలమంది మరణించగా, 123 కోట్ల డాలర్ల ఆర్థిక నష్టం కూడా సంభవించింది. అమెరికా అందిస్తున్న 'సహాయం' 200 కోట్ల డాలర్లుగా వుంది". "మా గిరిజన ప్రాంతాలన్నీ తుడిచివేయబడ్డాయి. లక్షలాదిమంది ప్రజానీకం తమ నివాసాలనుండి తరిమివేయబడ్డారు. ఈ యుద్ధం సాధారణ ప్రజానీకపు జీవితాలపై సైతం ఘోరమైన ప్రభావం చూపింది". "తమ వైఫల్యానికి పాకిస్తాన్‌ను బలిపశువుగా మార్చేబదులు అమెరికా తన ప్రయత్నాలను గంభీరంగా అంచనా వేసుకోవాలి. 1,40,000 నాటో సైన్యము, 2,50,000 ఆఫ్ఘన్ బలగాలతోపాటు, ఒక ట్రిలియన్ (లక్షకోట్ల) డాలర్లు ఆఫ్ఘనిస్తాన్ యుద్ధంపై ఖర్చుపెట్టామని చెబుతున్నప్పటికీ, గతంకంటే తాలిబన్లు నేడు మరింత దృఢంగా ఎందుకున్నారనే అంశాన్ని వారు పరిశీలించుకోవాలి" అని పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ వ్యాఖ్యానించాడు.

రెండు దేశాల, ఇద్దరు నాయకుల గద్దింపులు లేదా వాదనలనుండి కొన్ని విషయాలు వెల్లడవు తున్నాయి. ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్లను అణచ టానికి దాదాపు రెండు దశాబ్దాలుగా అమెరికా మరియు దాని మిత్రదేశాల నాటో కూటమి ఆధ్వర్యంలో సాగిస్తున్న దురాక్రమణ యుద్ధం వారిని అణచలేకపోయిందనే వాస్తవాన్ని ఇరు దేశాల నాయకులూ అంగీకరిస్తున్నారు. ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా 'టెర్రరిజంపై పోరు' పేరిట సాగించే యుద్ధం, ప్రపంచ ప్రజలను దగా చేయటమే. వాస్తవానికి, చిన్నవైన బలహీన దేశాలను, ఆ దేశాల వనరులను, ప్రజానీకాన్ని లోబరుచుకోవటానికి, ఆయా దేశాలను తన వలసలుగా మార్చుకోవటానికి ఉవ్విళ్ళూరుతున్న అగ్రరాజ్యం సాగిస్తున్న అన్యాయమైన, అణచివేత యుద్ధమే ఇది. సామ్రాజ్యవాద సైనిక బలగాలను ఎదుర్కొంటూ, సుదీర్ఘకాలంగా యుద్ధాన్ని సాగిస్తూ నిరాకరించవీలులేని ఒక శక్తిగా తాలిబన్లు ఆవిర్భ వించటానికి, విశాలమైన భూభాగాలను, దాదాపు సగం జనాభాను తమ అధీనంలో ఉంచుకోగల గటానికి ప్రధాన కారణం, వారు న్యాయమైన ప్రతిఘటన సాగిస్తుండటమే. ఆఫ్ఘన్ ప్రజలు వారికి దన్నుగా వున్నారు. అణచివేయటం మినహా మరోమార్గం లేదని, అత్యంత ప్రమాదకర టెర్రరిస్టు భూతాలుగా ఇంతకాలం చిత్రస్తూ వచ్చిన ఆ తాలిబన్లతోనే అమెరికా సామ్రాజ్య వాదులు ఇప్పుడు చర్చల క్రమంలోనుండటం ఆసక్తికరం.

పాకిస్తాన్ నాయకులు చేస్తున్న వాదనలు, అమెరికా సాగిస్తోన్న అన్యాయమైన యుద్ధానికి తాము ఇంతకాలం తోడ్పాటునిస్తూ వస్తున్నామన్న వాస్తవాన్ని ప్రతిబింబించటంలేదు. అమెరికా నాయకులు తగినంతగా తమ సేవలను గుర్తించ లేదనేదే వాళ్ళ ఆరోపణల సారాంశమంతా. అలాగే ఆఫ్ఘనిస్థాన్ ప్రజలపై సాగించే యుద్ధంలో వైఫల్యానికి హేతువిరుద్ధంగా తమను నిందించటం గురించే వారి బాధ అంతా. ఇది పాకిస్థాన్ ప్రజలందరికీ అవమానకరమైనది.

పాకిస్థాన్ నాయకులను బాహాటంగా గద్దించటంలో అమెరికాకు మరో కారణం కూడా వుంది. కొంతకాలం వరకు, పాకిస్థాన్ పాలకులు అమెరికాకు దాసోహంగా వుంటూనే, చైనాతో ఆర్థిక, సైనిక సంబంధాలు పెంచుకోవటంపై కేంద్రీకరిస్తూ వస్తున్నారు. ఇది అమెరికాను కొంత కలవరపాటుకు గురిచేస్తోంది. ముఖ్యమైన వ్యూహాత్మక భాగస్వామి అయిన పాకిస్థాన్‌ను అంతిమంగా చేజార్చుకునే వైపుగా ఇది దోవ తీస్తుందేమోనని భావించటమే అమెరికా కలవరపాటుకు కారణం. దీనినుండి పాకిస్థాన్‌ను ఏవిధంగా పక్కకు మళ్ళించాలనేది అమెరికాను వేధిస్తున్న అంశం. పెరుగుతున్న పాకిస్తాన్–చైనా సంబంధాల కారణంగా ఆఫ్ఘనిస్తాన్ సంక్షోభాన్ని పరిష్కరించి, తాలిబన్లను అదుపుచేసి, తన ప్రయోజనాలకనుగుణంగా వ్యవహరించటం మరింత సంక్లిష్టమౌతుందేమోనని అమెరికా సంశయిస్తోంది. కనుక పాకిస్థాన్ పట్ల అమెరికా బుజ్జగించే వైఖరితో కాకుండా గద్దించే, హెచ్చరించే వైఖరితో వ్యవహరిస్తోంది.

అమెరికాను దేబిరించే వైఖరిని పాకిస్థాన్ పాలకులు విడనాడాలి. ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా సాగించే దురాక్రమణ యుద్ధంలో తాము చేసిన సేవలను, త్యాగాల ప్రాధాన్యతను తగ్గించు కోనవసరం లేదు. తాలిబన్లను అణచటంలోగల వైఫల్యానికి కారణాలను నిర్ధారించటంలో హేతుబద్ధంగా వ్యవహరించమని అమెరికాను దేబిరించటంకాదు; అమెరికా మరియు నోటో కూటమి దేశాలు వారి సైనిక బలగాలను ఆఫ్ఘనిస్తాన్‌లోకి నడిపించి, అన్యాయమైన యుద్ధాన్ని సాగించటం - బలహీనమైన చిన్న దేశాన్ని, ఆ దేశ ప్రజలను సైనికశక్తితో వారి పాదాక్రాంతం చేసుకోవాలనే దురుద్దేశంతో ననే వాస్తవాన్ని పాకిస్థాన్ పాలకులు అంగీకరించటం నేటి అవసరం. అయితే సామ్రాజ్యవాదుల ఎదుట సాగిలబడటానికే కట్టుబడివున్న పాకిస్తాన్ పాలకులు, పాకిస్తాన్ భూభాగాలను, పాకిస్తాన్ వనరులను నిస్సిగ్గుగా అమెరికా చేతులలో వుంచటానికి దళారులుగా, కమిషన్ ఏజెంట్లుగా అమెరికాకు తమ సేవలు కొనసాగించటానికే నిర్ణయించుకున్నారు. ఒక చిన్న పొరుగుదేశంపై సాగించే దుర్మార్గమైన ఈ అణచివేత యుద్ధం లోకి పాకిస్థాన్ ప్రజల ఆకాంక్ష లకు విరుద్ధంగా, పాకిస్థాన్ ప్రజలను పాకిస్థాన్ నాయకులు ఈడుస్తున్నారు. సామ్రాజ్యవాదం ఎదుట సాగిలబడే బంధాన్ని తెగదెంపులు చేసుకోవటమే, ఈ ఘోర నేరాన్ని దిద్దు కునేందుకు పాకిస్థాన్ పాలకుల ముందున్న ఏకైక, సరైన మార్గం. అలాగే, అమెరికా దురాక్రమణ నుండి విముక్తికోసం స్వేచ్ఛా వాయువులు పీల్చటం కోసం ఆఫ్ఘన్ ప్రజలు సాగించే కృషికి వారికి వీలైన సహాయ సహకారా లందించటమే వారి ముందున్న మార్గం.

చాలాకాలంగా, అమెరికా సామ్రాజ్య వాదులు భారతదేశం, పాకిస్తాన్‌ల నడుమనున్న వివాదాలనుపయోగించి ఉద్రిక్తతలను, శత్రుత్వాన్ని, గొడవలను పెంచటానికి, యుద్ధాన్ని ప్రేరేపించ టానికి చూస్తున్నారు. 'యుద్ధంలేదు-శాంతిలేదు' అనే పరిస్థితులను రెండు దేశాలమధ్య కల్పిస్తూ వస్తున్నారు. సామ్రాజ్యవాదులకు దాసోహంచేసే ఇరు దేశాలలోని పాలకవర్గాలు తమ మధ్యవున్న విబేధాలను సౌహార్ద్ర పూరితంగా చర్చించుకొని పరిష్కరించుకునే బదులుగా సామ్రాజ్యవాదులు ఆడే ఈ ఆటలో భాగస్వాములవుతున్నారు. సామ్రాజ్యవాదులు, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులు, ఇరు దేశాలతోనూ పెద్ద ఎత్తున ఆయుధాల వ్యాపారం చేస్తున్నారు. భారత -పాకిస్తాన్‌ల నడుమ ఈ విబేధాలు, విద్వేషాలు కలకాలం కొనసాగించే విధంగా సామ్రాజ్య వాదులు తమ స్వార్ధ ప్రయోజనాలతో వ్యవహరిస్తున్నారు. ఆఫ్ఘనిస్థాన్‌పై అమెరికా సాగించే యుద్ధంలో తమకనుకూలంగా చాలా సులభంగా పాకిస్థాన్‌పై తమకున్న పట్టును ఉపయోగించారు. 'రక్షణ సహాయం' పేరిట అమెరికా అందించే నిధులు, పాకిస్థాన్ పాలకులను కమిషన్ ఏజెంట్లుగా దిగజార్చింది. ఒసామా బిన్ లాడెన్ అనే భూతాన్ని సామ్రాజ్య వాదులు తమకు తామే సృష్టించారనే విషయం యావత్ ప్రపంచానికీ తెలుసు. ఈ భూతాన్ని సామ్రాజ్యవాదులు తమకు ఎక్కడ అవసరమైతే అక్కడ, ఎంతవరకు అవసరమైతే అంతవరకు ఉపయోగించారు. ఇక ఆ భూతంతో పని ముగిసిందనుకున్న తరువాత దాని అడ్డు తొలగించుకున్నారు. ఆసియా పైనా, ఆసియా -పసిఫిక్ ప్రాంతంపైనా ఆధిపత్యంకోసం అమెరికా వ్యూహంలో భాగంగా అమెరికా నాయకత్వంలో అమెరికా-జపాన్-ఆస్ట్రేలియా -ఇండియా ఒక కూటమిగా ఎప్పుడైతే ముందుకు వచ్చాయో, ఆఫ్ఘనిస్తాన్‌లో ఇండియా జోక్యం పెరగటాన్ని మనం చూడవచ్చు. అమెరికా మిత్రకూటమిలో ఒక సభ్యదేశమైన పాకిస్థాన్, అమెరికా శత్రువుగా భావిస్తున్న చైనాతో దౌత్య, సైనిక సంబంధాలను పెంపొందించుకోవటం వంటివి కూడా అమెరికా- పాకిస్థాన్-ఇండియా సంబంధాలపై ప్రభావం చూపవచ్చు. అయి నప్పటికీ, భారతదేశం, పాకిస్థాన్‌లతో అమెరికా సంబంధాలు-ఒక సామ్రాజ్యవాద అగ్రరాజ్యానికి, దానికి సాగిలబడిన దేశాలకు నడుమ సంబంధాలుగా మౌలికంగా వుంటాయనేది స్పష్టం. తమకు లోబడిన దేశాలను, వాటి మధ్యవున్న వైరుధ్యాలను ప్రపంచాధిపత్యంకోసం ప్రయత్నించే సామ్రాజ్యవాద అగ్రరాజ్యం తన ప్రయోజనాలకు అనుగుణంగా వుపయోగించు కుంటూనే వుంటుంది. భారతదేశం, పాకిస్తాన్‌ల ఉమ్మడి ప్రయోజనాలు ఏమని డిమాండ్ చేస్తున్నాయంటే, సామ్రాజ్యవాదుల జోక్యం లేకుండా ఇరుదేశాలు తమ మధ్యనున్న సమస్య లను పరిష్కరించుకోవాలని కోరుతున్నాయి. అలాగే సామ్రాజ్యవాదానికి, ఆధిపత్య రాజకీయాలకు వ్యతిరేకంగా సాగే పోరాటంలో ఐక్యతను పెంపొందించుకుందామని కోరు తున్నాయి.

ooooo